# ఎవడికెక్కాలి రోడ్డు?

'అయ్యా! ఈ రోడ్డు ఎక్కడికి పోతుందండీ!

'ఏమో నాకేం తెల్సు'

'అది కాదండీ! ఈ రోడ్డు మా వూరికి పోతుందా?'

'మీ ఊరంటే!'

"బలే వాడివయ్యా! ఈ రోడ్డు గురించి తెలీదు. మా వూరి గురించి తెలీదు" అని వికటంగా నవ్వాడు వెంకయ్య.

'బలేవాడవయ్యా! నీవూరేమిటో నాకెలా తెలుస్తుంది? గొప్ప తెలివైనవాడవు!! మరీ పిచ్చిగా నవ్వాడు సీతయ్య!

ఇలా వుంటుంది మన బాటసారుల సంభాషణ.

అసలు రోడ్డంటే అందరికీ అలుసే.

రోడ్డువెంట పోవడమే తప్ప రోడ్డు ఎక్కడికి పోతుందో చాలా మందికి తెలీదు. తన వూరుదాకా పోతుందని తెల్సు. అంతవరకు నడిచి వెళ్ళిపోతాడు ప్రయాణీకుడు. రోడ్డు చివరి గమ్యం తెలీదు. రోడ్డు మధ్యలో చీలిపోతుంది. వాగులు, బ్రిడ్జిలు వస్తే ప్రక్కదారి పడుతుంది. మైలురాయి చెపుతుంది దాని జాతకం. ఇది జిల్లా రోడ్డు.

నగరం రోడ్డు అందరూ వాడుకునే వేశ్యలాంటిది. నడుస్తాం. చెత్త, చెదారం, కాగితాలు, అరటి తొక్కలు, మనం తినగా మిగిలింది. రోడ్డుమీదికి విసిరేస్తాం. అవన్నీ తన గుంటల్లో దాచుకుని రోడు వెకిలిగా నవ్వుతుంది. రోడ్డంటే అందరికీ లోకువే!

ఒకరోజు ఆటోవాడు మా మిత్రుణ్ణి ఒక యింటి దగ్గరదించి అసలు రేటుకంటె డబుల్ వసూలు చేశాడుట! ఇదేమి న్యాయం అంటే- ఈ రోడ్డు మీద ఆటో వెడుతుందా సార్! ఇక్కడికి రావాలని ముందే చెబితే నేను వచ్చేవాణ్ణి కాను- సయం ఆటో రిమ్ములు విరగలేదు- అబ్బబ్బా ఇది రోడ్డా సార్! ఇక్కడ ఎలా వుంటున్నారు మీరు! అద్దెకు యిక్కడ వుండే కంటే మరోచోటుకి మారండి- అని ఉచిత సలహా విసిరేసి రివ్వున పోయాడా ఆటోవాడు.

వో పెద్ద మనిషి ఓ రిక్షావాడిని పిలిచాడు.

'చూడయ్యా! బజారుకెళ్ళాలి, ఎంత తీసుకుంటావు'

'ఇదంతా 'చడావ్' కదుసార్! పది రుపాయలవుతుంది!

'పది రుపాయలు పెడితే ఓ సంచి కూరలొస్తాయి గదయ్యా!'

'నేను రిక్షా తొక్కాలి కదయ్యా! పది రుపాయలు రక్తం ఖర్చు వుద్ది నాకు' అన్నాడు రిక్షావాడు.

ఎత్తుగడ్డల రోడ్డు ప్రక్కన కాపురాలుంటే ఇదీ గొడవ- ఏ వాహన మైనాసరే 'గూబగుయ్' మనేలా ఛార్జీలు పెంచుతారు-

ఇటీవల కాలంలో రోడ్డు వేయడం ప్రజా నాయకులకు సంబరం- ఎంత నిధి ప్రభుత్వం కేటా యిస్తేరోడ్డులో ఓ గల్లీ బాగుచేయిస్తున్నారు, అక్కడి కాంట్రాక్టరుని అడిగాను- ఈ రోడ్డు కొంచెం తారు రోడ్డు వేయమని- అతను సార్! ఇది సిమెంట్ రోడు వేయమని ఆర్డరు యిచ్చారు కదా అన్నాడు.

మరో పదిరోజులదాకా కంకర, యిసుక, గుట్టలు గుట్టలుగా పడి వున్నాయి అక్కడ- ఓ రోజు కంకర, యిసుక రోడుమీదవేసి పోయాడు కాంట్రాక్టరు- ఆ మర్నాడు పెద్ద వాన వచ్చింది. రోడుమీద రాయి ఇసుక ఏమీ లేకుండా అంతా కొట్టుకుపోయాయి. ఆ గల్లీలో వెళ్ళేవాళ్ళకి

రోజుకు రెండుసార్లు చెప్పులు తెగిపోతాయట- అక్కడి గతుకులవల్ల- సిమెంట్ రోడ్డు వేయాలని ఆర్డరు అన్నాడు- ఆ కేటాయించిన నిధి ఏమయిపోయిందో! డబ్బు సంపాదనలో రోడ్డు కూడా ఒక మార్గం-

ఓ రోజు ఓ లేబరు లీడరు ఒక చిన్న ఊరేగింపుతో అరుస్తూ పోతున్నాడు.

'మా గుడిసెలోళ్ళకు పట్టాలు కావాలీ' అని అరుస్తున్నాడు- వాడి అరుపులకు వెనకాల వాళ్ళు తందానా! వాళ్ళ చేతుల్లో ఓ బొంత, చెంబు చాప- గిన్నెల మూట- వేళ్ళాడుతున్నాయి. ఆ నాయకుణ్ణి అడిగాను 'ఎక్కడ పట్టాలు కావాలయ్యా మీకు అని.

'ఎక్కడేమిటి సార్! ఈ సిటీలో ఎన్నో రోడ్లు ఉన్నాయి-కాళీగా ఎవరూ వాడడం లేదు. రోడ్లమధ్య చిన్న పార్క్‌లెందుకు? అవి మాకిచ్చెయ్యొచ్చు కదా! నగరం మధ్యలో మా వాళ్ళు గుడిసె వేసుకుంటే, గాలీ, వెలుతురు వుంటుంది. మా వాళ్ళు ఆరోగ్యంగా వుంటారు' అన్నాడు ఆ కార్మిక నాయకుడు.

వాడు అనడమేమిటీ! ప్రభుత్వం రోడ్డు యిచ్చారో లేదో కాని, ఓ రోడ్డుమీద గుడిసెలు రాత్రికి రాత్రి వేయించేశాడు ఆ నాయకుడు- మర్నాడు ఆ దారినపోయే కార్లు, ఆటోలు, రిక్షాలు, ఏమనాలో అర్థం కాక ప్రక్కదారిన సర్దుకు వెళ్ళిపోతున్నాయి. ఓ పోలీసు కూడా వచ్చి అక్కడ నిల్చుని వాహనాలను ప్రక్క మార్గంలోకి మరలిస్తున్నాడు. మనదేశంలో రోడ్డంటే అందరికీ లోకువే. రోడ్డుకడ్డంగా పెళ్ళి మండపం కడతారు. రోడ్లమీద దేవుణ్ణి నిలబెట్టి ఉత్సవాలు చేస్తారు. దాన్ని ఏం చేసినా ఎవరూ అడిగేవాడు లేడు. అందరికీ కావలసినా అందరికీ అక్కర లేని "అనాధ" మన రోడ్డు.

•••